

చొప్పదండి: వీర్ల వెంకటేశ్వర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు




కొడిమ్యాల: శ్రీనివాస్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

# అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు

- **పార్టీలో చేరిన యువకులకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే సుంకె, ప్రజాప్రతినిధులు**

చొప్పదండి, నవంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఎన్నికల మ్యానిఫెస్టోను మెచ్చి యువకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పార్టీ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్ రావు పేర్కొన్నారు. రామడుగు మండలం వెలిచాల గ్రామంలో 20 మంది యువకులు గురువారం పార్టీ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వీర్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్ రావు, ఉప సర్పంచ్ పూదరి వెంకటేశ్, వార్డు సభ్యులు వంగ వెంకటరమణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

***కొడిమ్యాల మండలంలో...***

కొడిమ్యాల, నవంబర్ 9: బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన యువకులు పార్టీలో చేరుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన 50 మంది యువకులు బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ గెలుపునకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కాగా, నల్లగొండ గ్రామానికి చెందిన కూన శ్రీనివాస్ ఎమ్మెల్యే రవిశంకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త జైపాల్‌రెడ్డి, సర్పంచ్ మల్యాల మహిపాల్, ఉప సర్పంచ్ సుమలత-రాజు, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు పవన్, నాయకుడు చీకట్ల మహేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: 7వ వార్డులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, నాయకులు



గంగాధర: సర్వారెడ్డిపల్లిలో బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ఇచ్చి ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

# సుంకె గెలుపునకు కృషి చేయాలి

- **చొప్పదండి, గంగాధర మండలాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రచారం**



గంగాధర: ఆచంపల్లిలో బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

చొప్పదండి, నవంబర్ 9: చొప్పదండిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ-భూమారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని 7వ వార్డులో బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి సుంకె రవిశంకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గంగాధర, నవంబర్ 9: మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చిలుముల రమేశ్, రేగుల తిరుపతి, ఎండీ శబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి

కలెక్టరేట్, నవంబర్ 9: ఈనెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కోసం నగరంలోని ఎస్సారార్ కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రాన్ని, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ పూర్తయిన అనంతరం డిసెంబర్ 3న నిర్వహించే కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఎస్సారార్ కళాశాలలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి చెందిన ఎంట్రీ, ఎగ్జిట్‌లు వేర్వేరుగా ఉండాలని, లెక్కింపు కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గత ఎన్నికల్లో అనుభవాల దృష్ట్యా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీ అభిషేక్ మహంతి, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఏసీపీ ప్రతాప్, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న డీఈవో, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ మహంతి

## విద్యార్థులకు అవగాహన

చొప్పదండి (రామడుగు), నవంబర్ 9: రామడుగు మండలం వన్నారం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో-ఆర్డినేటర్ సంపత్ ముఖ్య అతిథిగా హాజరై నంబర్ 1098ను ఆపద సమయంలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీరాజం, చైల్డ్ హెల్ప్ లైన్ టీం సభ్యులు నరేంద్ర, సాయికిరణ్, మహేశ్, చరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ దివాళి-శుభ దివాళి కార్యక్రమం



ప్రమిదలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

చొప్పదండి, నవంబర్ 9: చొప్పదండి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివాళి-శుభ దివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలు కాలుష్యం బారిన పడకుండా ప్రమిదలతో దీపాలను వెలిగించి వాతావరణ కాలుష్యాన్ని కాపాడాలని కోరారు. అనంతరం పట్టణ ప్రజలకు ప్రమిదలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్, మెప్మా డీఎంసీ శ్రీవాణి, ఏడీఈఎం సీ మానస, జూనియర్ సహాయకులు రవీందర్, అంజయ్య, శ్రీధర్ రెడ్డి, సుధాకర్, రాజయ్య, లలిత, వార్డు ఆఫీసర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శివాని, మెప్మా ఆర్పీలు, ఓబీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో ముందస్తు దీపావళి వేడుకలు



చిన్నారులతో కలిసి కలర్స్‌డేలో పాల్గొన్న పాఠశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి

చొప్పదండి, నవంబర్ 9: రామడుగు మండలం గోపాల్‌రావుపేటలోని అల్ఫోర్స్ పాఠశాలలో గురువారం కలర్స్ డే, ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, జీవితంలో రంగుల ప్రాముఖ్యత గురించి వివరించారు. దీపావళి పండుగ విశిష్టతను విద్యార్థులు నాటిక రూపంలో ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతా

- **మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి**

చొప్పదండి, నవంబర్ 9: తాను బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని, పార్టీని వీడి వేరే పార్టీలో చేరే ప్రసక్తే లేదని మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి తెలిపారు. తాను పార్టీ మారినట్లు వస్తున్న కథనాల్లో నిజం లేదని, కొందరు తనపై కక్షపూరితంగా బీఆర్‌ఎస్‌ను వీడి వేరే పార్టీలో చేరుతున్నట్లు చేస్తున్న ప్రచారం అవాస్తవమని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ నామినేషన్ కార్యక్రమానికి తన సతీమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ హాజరైనట్లు తెలిపారు. చొప్పదండిలో గులాబీ జెండా ఎగుర వేసేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

## ఏడు నామినేషన్లు దాఖలు

చొప్పదండి, నవంబర్ 9: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చేపడుతున్న నామినేషన్ల స్వీకరణలో 6వ రోజు ఏడు నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఫుల్‌దేశాయ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నుంచి సుంకె రవిశంకర్ 3 సెట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియానుంచి బంగారి మాధవ, కాంగ్రెస్ నుంచి మేడిపల్లి సత్యం, స్వతంత్ర అభ్యర్థి దాసరి విద్యాసాగర్, ఆల్ ఇండియన్ ఫార్వర్డ్‌బ్లాక్ నుంచి ఎంఎస్ విజయ్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థి గౌరు అజయ్‌కుమార్, ధర్మసమాజ్‌పార్టీ నుంచి జంగం సాధన నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. శుక్రవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగుస్తుందని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.